

మంత్రిని కలిసిన జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో బుధవారం రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును ఆయన కార్యాలయంలో జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతల గురించి వారు చర్చించారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌పి

ఆదిలోనే అష్టకష్టాలు..!


భారీగా పెరిగిన ఖరీఫ్ సాగు పెట్టుబడి

భారంగా ఎరువులు, పురుగు మందుల ధరలు

ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడి

కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణం

పెట్టుబడి సాయంపై నోరుమెదపని ప్రభుత్వం



పాలకోడేరులో ఇంజిన్‌తో పొలాల్లోని నీటిని తోడుతున్న వైనం

ప్రజాశక్తి - భీమవరం

ఆరుగాలం శ్రమించే రైతన్న కష్టమంతా పెట్టుబడికే సరిపోతుంది. పెరిగిన ఎరువులు, పురుగుమందుల ధరలు, ఇతర భారాలు రైతులను ఆర్థికంగా కుంగదీస్తున్నాయి. ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకూ పెట్టుబడి పెడుతున్న రైతన్న పంట ఆశాజనకంగా పండితే రూ.50 వేల వరకూ వస్తోంది. అయితే ప్రకృతి వైపరీత్యాలు ఆ మొత్తాన్ని చేతికి రానీయడం లేదు. దీంతో పేద, మధ్యతరగతి రైతులతోపాటు కౌలురైతుల పరిస్థితి దయనీయంగా మారింది. రైతులకు ప్రభుత్వాల నుంచి పూర్తిస్థాయిలో సాయం అందకపోవడంతో కష్టనష్టాల నడుమ ఖరీఫ్ సాగు ముందుకు సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో సార్వా సాగుకు వ్యవసాయ శాఖ ముందస్తు ప్రణాళిక రూపొందించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నారుమడులు పూర్తిస్థాయిలో పోయలేదు. జిల్లాలో గత నెల ఒకటో తేదీన కాలువలకు నీటిని విడుదల చేసినప్పటికీ శివారు ప్రాంత పొలాలకు నీరందే పరిస్థితి లేదు. దీనికితోడు సాగులో పలు సమస్యలు వెంటాడుతుండటంతో సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటివరకూ కేవలం 40 శాతం మాత్రమే నారుమడుల ప్రక్రియ పూర్తయింది. మిగిలింది మరో వారం, పది రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో రెండు లక్షల 46 ఎకరాలు, ఏలూరు జిల్లాలో లక్షా 40 వేల ఎకరాల్లో రైతులు ఈ ఏడాది సార్వా సాగు చేపడుతున్నారు. రెండు జిల్లాల్లో సుమారు ఏడు లక్షల మంది రైతులుండగా వీరిలో సుమారు నాలుగు లక్షల మంది వరకూ కౌలురైతులే ఉన్నారు. నూటికి 80 శాతం కౌలు రైతులే సాగు చేస్తున్నారు. గతంతో పోలిస్తే యాంత్రీకరణ పెరగడం, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగిపోవడంతో పెట్టుబడి ఖర్చులు అమాంతం పెరిగాయి. దీంతో పెట్టుబడులకు తగ్గ ఆదాయం రాకపోవడంతో రైతులు సాగుకు దూరమవుతున్నారు. ఎకరాకు సరాసరిన రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకూ పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఎకరాకు రూ.50 వేల వరకూ వస్తున్నప్పటికీ కేవలం రూ.10 వేలు మాత్రమే రైతుల చేతికి అందే పరిస్థితి ఉంటోంది. అదీ ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా పంట సంపూర్ణంగా చేతికి అందితేనే. కొన్ని పరిస్థితుల్లో చిల్లిగవ్వ కూడా రైతులకు వచ్చే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో కౌలురైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. గుర్తింపు కార్డులు లేక, రుణ సాయం అందక, రైతుభరోసా, నష్టపరిహారం, బీమా వంటివేమీ వీరికి అందడం లేదు. జిల్లాలో నరసాపురం, యలమంచిలి, పాలకోడేరు, గణపవరం, భీమవరం రూరల్ పరిధిలోని గ్రామాల్లో భూములు బీడుగా వదిలేస్తున్నారు. గతేడాది సార్వాలో 20 వేల హెక్టార్లలో సాగు చేయకుండా వదిలేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అందని ప్రభుత్వ సాయం

వరిసాగుకు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా సహకారం అందలేదని పలువురు రైతులు బహిరంగంగా చెబుతున్నారు. ప్రభుత్వ లబ్ధి భూయజమాని అంగీకారం లేకపోవడంతో కౌలురైతులు పూర్తిగా నష్టపోతున్నారు. అయితే ఎక్కువ శాతం కౌలురైతులు సాగు చేస్తున్నప్పటికీ వారికీ సాయం అందించడంలో ప్రభుత్వాలు వెనుకంజలోనే ఉంటున్నాయి. ప్రభుత్వం అందించే లబ్ధిలోనూ సవాలక్ష నిబంధనలు పెట్టి అసలైన సాగుదారునికి అన్యాయం చేస్తున్నారు. సాగులో ప్రధానపాత్ర పోషించే యాంత్రిక పనిముట్లకు ఉమ్మడి జిల్లాలో గత ప్రభుత్వం రూ.25 కోట్ల వరకూ బడ్జెట్ కేటాయించినప్పటికీ అతీగతీ లేకుండాపోయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ వ్యవసాయానికి నిధుల కేటాయింపుపై సరైన స్పష్టత ఇవ్వలేదు. కేవలం రైతులకు అందించే సాయాన్ని మాత్రమే ప్రకటించారు తప్ప ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సహకారం లేకపోవడంతో రైతులు సాగుకు వెనకడుగు వేస్తున్నారు.

తగ్గుముఖం పడుతున్న వరిసాగు

సవాలక్ష సమస్యలు వ్యవసాయ సాగులో ఉత్పన్నమవ్వడంతో రానురాను సాగు తగ్గుముఖం పడుతోంది. సాగులో కీలకమైన కౌలురైతులు వరుస నష్టాలతో సాగుకు వెనుకాడుతున్నారు. లీజు కొన్ని ప్రాంతాల్లో ఒకలా ఉంటే మరికొన్ని ప్రాంతాల్లో మరోలా ఉంది. అయితే ఈ ఏడాది వరి సాగులో కౌలు రేటు పెరిగినట్లు తెలుస్తుంది. వరిసాగు చేసేవారు లేక కొన్ని ప్రాంతాల్లో కౌలు రేటు తగ్గితే, చేలు బాగా పండే చోట్ల అధికంగా ఉంది. ఎకరాకు 12 బస్తాలు నుంచి 16 బస్తాల వరకూ లీజు ఉండేది. అదికాస్తా 10 బస్తాల్లోపు కొన్ని ప్రాంతాల్లో ఆరు బస్తాలకు పడిపోయింది. దీనికి కారణం పెట్టుబడి పెరగడంతో కౌలు రైతులు తగ్గిపోవడమేనని భూయజమానులు అంటున్నారు. ఎకరం ధర రూ.40 లక్షలు నుంచి రూ.కోటి ఉంటే ఏడాది మొత్తం వ్యవసాయం చేసినప్పటికీ ఆదాయం మాత్రం రూ.20 వేలు వస్తుందని రైతులు చెబుతున్నారు.

ఎకరానికి పెట్టుబడి ఖర్చులు ఇలా

నారుమడికి రూ.1800, దమ్ముకు రూ.నాలుగు వేలు, గట్టులంకకు రూ.1400, బాగుచేతకు రూ.1400, నాట్లు వేయడానికి రూ.ఆరు వేలు, కలుపు తీతకు రూ.1800, ఎరువులు రూ.ఏడు వేలు, పురుగు మందులు రూ.6800, మాసూలు కూలి రూ.3300, పంట మాసూళ్ల రూ.7400 మొత్తం కలిపి రూ ఆయా ప్రాంతాలను బట్టి రూ.35 వేలు నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి అవుతుంది. అయితే ఇటీవల జిల్లాలో కురిసిన వర్షం ధాటికి నారుమడులు, నాట్లు వేసిన చేలు నీటమునిగాయి. దీనిలో భాగంగా వర్షపు నీటిని తోడేందుకు ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేశారు. దీనికి అదనంగా ఎకరాకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు పెట్టుబడి పెరిగింది.

సిసిఆర్‌సి చట్టం రద్దు చేయాలి

మామిడిశెట్టి రామాంజనేయులు,
కౌలురైతు సంఘం పశ్చిమ జిల్లా కార్యదర్శి




ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ కౌలురైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదు. సాగులో కౌలురైతులు ఆర్థికంగా అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. వాస్తవ సాగుదారులైన కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదు. కౌలు రైతులను ప్రభుత్వం మోసగిస్తోంది. రైతు భరోసా, పంట నష్టపరిహారం, పంటల బీమా, బ్యాంకు రుణాలు పూర్తిస్థాయిలో అందడం లేదు. నామమాత్రంగా అందించి చేతులు దులుపుకుంటున్నారు. 2019లో వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంట సాగుదారుల హక్కుల చట్టం (సిసిఆర్)ను రద్దు చేయాలి. గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంతో పంట నమోదు చేయనీయడం లేదు. రాయితీలన్నీ భూయజమానులకు వర్తిస్తున్నాయి. కౌలురైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది.

ఎంపిడిఒ అదృశ్యంపై వీడని ఉత్కంఠ..!

విజయవాడలోని ఏలూరు కాల్వలో కొనసాగుతున్న గాలింపు

ప్రజాశక్తి - నరసాపురం



ఎంపిడిఒ వెంకటరమణరావు

నరసాపురం ఎంపిడిఒ ఎం.వెంకటరమణరావు అదృశ్యంపై ఉత్కంఠ కొనసాగుతోంది. సోమవారం రాత్రి వరకూ కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడిన వెంకటరమణరావు ఆ రోజు రాత్రి తనకు పుట్టినరోజే చావురోజని ఒక మెసేజీ పంపడం, ఆయన సెల్ సిగ్నల్ విజయవాడలోని మధురానగర్ సమీపంలో ఏలూరు కాల్వ గట్టు వరకూ పని చేసి నిలిచిపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం రాత్రి నుండే పోలీసులు, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు ఏలూరుకాల్వ వెంబడి గాలింపు చర్యలు చేపట్టాయి. సుమారు మూడు బృందాలు గాలిస్తున్నా బుధవారం రాత్రి వరకూ ఎటువంటి ఆచూకీ లభించలేదు. దీనికితోడు కాల్వలో పెద్దఎత్తున గుర్రపుడెక్క ఉండటంతో గాలింపు చర్యలకు ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. ఎంపిడిఒ అదృశ్యం, తర్వాత పంపిన మెసేజీల వెనుక కారణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఆయన కాల్ డేటా కీలకంగా మారొచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ నెల 12న జరిగిన మండల పరిషత్ సమావేశంలో కూడా టిడిపి కూటమి ప్రజా ప్రతినిధులు మాధవాయపాలెం ఫెర్రీరేవు సొమ్ముపై మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఎందుకు అలసత్వం వహించారని అధికారులను ప్రశ్నించారు. ఆ సమావేశానికి సెలవు రీత్యా రమణరావు హాజరు కాలేదు. రూ.54 లక్షల ఫెర్రీ బకాయిల వసూళ్లు చేయకపోవడంలో ఎంపిడిఒ పాత్ర పెద్దగా లేనప్పటికీ తనను ఎక్కడ బాధ్యుడిని చేస్తారోనని ఆయన ఆందోళనకు గురైనట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఫెర్రీని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న తర్వాతే ఆయన సెలవుపై వెళ్లారు. ఎంపిడిఒ అదృశ్యంపై రాజకీయనేతల పాత్ర, ఫెర్రీ కాంట్రాక్టుదారుని పాత్రపై లోతుగా విచారించాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

ఇదిలా ఉండగా ఎంపిడిఒ అదృశ్యంపై పూర్తిస్థాయిలో విచారించాలని డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. విజయవాడలో ఆయన ఈ అంశంపై అధికారులతో మాట్లాడుతూ ఫెర్రీ బకాయిల వివరాలు తనకు అందజేయాలని, ఈ అంశంలో ఏం జరిగిందనే దానిపై పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని ఆదేశించారు.

ఆధార్ అప్‌డేట్‌కు మరో అవకాశం

23 నుండి 27 వరకు ప్రత్యేక మొబైల్ క్యాంపులు

యానాది, ఎరుకల కుటుంబాల ఎన్‌రోల్‌మెంట్‌కు తహశీల్దార్లకు ఆదేశాలు

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఆధార్ అప్‌డేషన్‌కు ఈ నెల 23 నుండి 27వ తేదీ వరకు ఐదు రోజులపాటు జిల్లావ్యాప్తంగా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక మొబైల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఆధార్ అప్‌డేట్ మొబైల్ క్యాంపులు ఏర్పాటు చేసి పెండింగ్‌లో ఉన్న ఆధార్ సర్వీసులను అప్‌డేట్ చేస్తారన్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఈ నెల 23 నుండి ప్రతిరోజూ ఎంపిక చేసిన నాలుగు ప్రాంతాల్లో ఆధార్ అప్‌డేట్ మొబైల్ క్యాంపులను ఏర్పాటు చేసే 27 నాటికి జిల్లాలోని 20 మండలాల్లో కొత్త ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, ఆధార్ డాక్యుమెంట్, ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్‌ను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తామన్నారు. ఏఏ తేదీల్లో ఏ గ్రామ, వార్డు సచివాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఆధార్ అప్‌డేట్ మొబైల్ క్యాంపులు నిర్వహించేది మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు విస్తృత ప్రచారం చేయాలన్నారు. వీరవాసరం ఎస్‌సి కాలనీలోని యానాది, ఎరుకల కుటుంబాలకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌తోపాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న యానాది, ఎరుకల కుటుంబాలను గుర్తించి వారిలో ఆధార్ లేని వారికి ఎన్‌రోల్‌మెంట్ తప్పనిసరిగా చేయించాలని తహశీల్దార్లను ఆదేశించారు. జిల్లా ప్రజలు ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

గోస్తనీ, జిఅండ్‌వి కెనాల్ ఆయకట్టు ప్రాంతం తరచూ ముంపునకు గురవుతోందని, ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ రైతులకు హామీ ఇచ్చారు. ఆయన బుధవారం ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ముంపునకు కారణాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. గోస్తనీ, జిఅండ్‌వి కెనాల్ కలిసే వేల్పూరు వద్ద గోదావరి నీటి ఒత్తిడి పెరగడంతో ఆ నీటిని మురుగు కాల్వలోకి వదలడం, వారం రోజులుగా కురిసిన వర్షాలకు ఎగువ నుండి వచ్చిన వర్షపు నీరు దిగువకు వెళ్లకుండా గోస్తనీలో పెరిగిన కిక్కిస, గురపుడెక్క, కలుపుమొక్కలు అడ్డం పడుతున్నాయని ఎంఎల్‌ఎ అన్నారు. ఈ డ్రెయిన్లలో విపరీతంగా పెరిగిన వాటిని తొలగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. జిఅండ్‌వి కెనాల్‌లో పేరుకుపోయిన తూడును తొలగించేందుకు రూ.9 లక్షల నిధులతో యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించామని ఇరిగేషన్ సబ్ ఇంజినీర్ జి.శ్రీనివాస్ తెలిపారు. గోస్తనీలో కిక్కిస తొలగించేందుకు రూ.20 లక్షల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచామని, త్వరలోనే పనులు చేపడతామని చెప్పారు. పితాని వెంట ఇరిగేషన్ ఎస్‌ఇ జి.శ్రీనివాస్, ఇఇ ఎవివి.కిషోర్, ఎఇలు ఎ.సత్యనారాయణ, ఎవి.సత్యనారాయణ, నీటి సంఘం మాజీ ఛైర్మన్ వెలగల బులిరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కాసాని విజయ్‌ప్రసాద్, కడలి ఏడుకొండలు, తమనంపూడి దుర్గారెడ్డి, కర్రి సుబ్బారెడ్డి, వరికూటి సాయికిషోర్, చింతపల్లి రామకృష్ణ, మాజీ ఎఎంసి ఛైర్మన్ సానబోయిన గోపాలకృష్ణ ఉన్నారు.



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

సెల్ రీఛార్జీల ధరలు తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి - ఆచంట

పెంచిన సెల్‌ఫోన్ కాల్, నెట్ రీఛార్జీల ధరలు వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం పోడూరు శాఖ కార్యదర్శి బొంతు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక బల్ల వంతెన వద్ద పెంచిన ధరలు తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తూ ప్రజలపై మోయలేని భారాలు వేస్తుందని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. కార్యక్రమంలో డి.నాగేశ్వరరావు, కె.శేషగిరి, జోగి కనకం, జి.సూర్యారావు పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం ఇవ్వాలి

మంత్రి నిమ్మల, ఆచంట ఎంఎల్‌ఎ పితానికి వినతిపత్రాలు అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని, సంబంధంలేని పనులు చేయించరాదని, ప్రభుత్వ సెలవులు, రిటైర్‌మెంట్, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, సంక్షేమ పథకాలు అమలుచేయాలని కోరుతూ ఆశా వర్కర్లు బుధవారం రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం సమర్పించారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో వారు మంత్రిని కలిసి తమ సమస్యలు వివరించారు. ఆశాల నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని, రాజకీయ జోక్యం తొలగించాలని కోరారు. పేదలకు ఆరోగ్య సేవలందిస్తున్న ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. 62 సంవత్సరాల రిటైర్‌మెంట్ జిఒ వర్తింపజేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్పు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఆశాల జిల్లా అధ్యక్షురాలు చింతపల్లి లక్ష్మి, కార్యదర్శి దిగుబాటి జ్యోతి, నేతలు లారెన్స్ కుమారి, అమ్మాజీ, జానకి, శ్రీ వర్ధిని, కమల కుమారి, వై.వెంకటలక్ష్మి, ఇ.శిరోమణి, సునీత పాల్గొన్నారు.



మంత్రి నిమ్మలను కలిసిన ఆశా వర్కర్లు

పెనుమంట్ర: ఆశాలకు కనీస వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మాజీ మంత్రి, ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణను ఆశా వర్కర్లు కోరారు. బుధవారం వారు ఎంఎల్‌ఎ పితానిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దిగుబాటి జ్యోతి, సిఐటియు నేతలు సూర్నీడు వెంకటేశ్వరరావు, నేతలు పి.రత్నకుమారి, పార్వతి, గంగ, సుశీల, భవాని, లక్ష్మి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి : మంత్రి

ప్రజాశక్తి - పాలకొల్లు

జగన్ తన ఐదేళ్ల పాలనలో ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించి నిలువునా మోసగించారని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద గిరిజన హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏకలవ్యుని జయంతి ఘనంగా నిర్వహించారు. ఏకలవ్యుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏకాగ్రతకు, గురుదక్షతకు ఏకలవ్యుడు పెట్టింది పేరని చెప్పారు. ఎస్‌టి యువతకు విద్య, ఉపాధి, ఉద్యోగ కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి, కడలి గోపీ, కోడి విజయభాస్కర్, ధనాని సూర్యప్రకాష్ పాల్గొన్నారు



మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

కానుపోతుకుంటలో బోరు పూడ్చివేత

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట పంచాయతీ పరిధి కానుపోతుకుంటలో బండి వెంకటకృష్ణకు చెందిన బోరు పైపు నుంచి మంగళవారం రాత్రి వింత శబ్దాలు, వాయువుతో బురద మట్టి గ్యాస్‌పైకి రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో స్థానికులు విఆర్‌ఒకు ఫోన్ చేయగా ఆయన అగ్నిమాపక కేంద్రానికి, ఒఎన్‌జిసి అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక జిల్లా అధికారి బి.శ్రీనివాసరావు, సహాయ అధికారి వైవి.జానకిరామ్, ఒఎన్‌జిసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆ రాత్రి తాత్కాలికంగా మట్టితో పూడ్చిపెట్టారు. బుధవారం ఉదయం ఒఎన్‌జిసి, అగ్నిమాపక సిబ్బంది మరోసారి పరిశీలించి ఆ పైపు ద్వారా ఇసుక వేసి సగం వరకూ పూడ్చిపెట్టి అనంతరం బ్యాలెట్ పౌడర్‌తో భూమికి సమాంతరంగా పూడ్చి వేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 200 అడుగుల లోతుకు వెళ్తే గాని నీరు వచ్చే పరిస్థితి లేదు. బండి వెంకటకృష్ణకు చెందిన బోరు పైపు 180 అడుగుల లోతులో నీరు రావడం జరిగిందని, మూడేళ్ల తర్వాత ఆ బోరు పైపు పని చేయలేదని ఆయన విలేకరులకు వివరించారు. పదేళ్ల క్రితం పూడుకుపోయిన బోరు బావి నుంచి వింత శబ్దాలు బురద మట్టి గ్యాస్ బయటకు రావడంతో స్థానిక విఆర్‌ఒకు సమాచారం అందించినట్లు తెలిపారు. గతంలో ఇదే ప్రాంతంలో చేతిపంపు నుంచి కొట్టకుండానే నీరు వచ్చేదని, 2019లో ఇదే ప్రాంతానికి చెందిన బండి ఏసుకు చెందిన చేతిపంపు నుంచి మంటలు వ్యాపించడంతో అప్పట్లో అధికారులు పరిశీలించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్థానికులకు భరోసా ఇవ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు. మరలా కానుపోతుకుంటలోనే పాడైపోయిన బోరు నుంచి మరోసారి వింత శబ్దాలు రావడంతో ఈ ప్రాంత ప్రజలంతా ఒక్కసారి ఉలిక్కిపడ్డారు.



బోరు పైపులు పూడుస్తున్న అధికారులు

పాలకొల్లులో గౌడ్ శెట్టిబలిజ భవన నిర్మాణం పూర్తి చేస్తాం

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో అసంపూర్తిగా నిలిచిన గౌడ్, శెట్టిబలిజ భవన నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. తన హయాంలో టిడిపికి పట్టుకొమ్మలుగా ఉన్న శెట్టిబలిజ, గౌడ సమైక్య భవన్ నిర్మాణానికి రూ.కోటీ 50 లక్షలు మంజూరు చేసి నిర్మాణం ప్రారంభించామని చెప్పారు. జగన్ పాలనలో రూపాయి పని కూడా చేయలేదని విమర్శించారు. బిసిలను కేవలం ఓటు బ్యాంకుగానే జగన్ వాడుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, శెట్టి బలిజ, గౌడ్ సోదరులు పాల్గొన్నారు.

6 మిల్లీమీటర్లు సగటు వర్షపాతం నమోదు

ప్రజాశక్తి - నరసాపురం

జిల్లాలో బుధవారం ఉదయం 8 గంటల వరకూ గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. పాలకొల్లులో 21.2, ఇరగవరం 17.4, అత్తిలి 16.8, తాడేపల్లిగూడెం 15.2, యలమంచిలి 10.4, ఆచంట 10.2, పెంటపాడు 7, తణుకు 6.8, పెనుమంట్ర 5.2, కాళ్ల 4.2, భీమవరం, నరసాపురం 1.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో 20 మండలాలకుగాను 120.8 వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 6.0 మిల్లీమీటర్లు అని అధికారులు తెలిపారు.

నేత్రాలను సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి - ఉండి

ప్రతి ఒక్కరూ తమ కళ్లను పరిరక్షించుకోవాలని వాంద్రం గ్రామ సర్పంచి దాసరి వెంకటకృష్ణ అన్నారు. బుధవారం వాంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచి దాసరి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ ఐ ఇన్స్టిట్యూట్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కంటి చూపు ప్రధానమన్నారు. వయసు రీత్యా 40 సంవత్సరాలు పైబడిన వారికి కంటి చూపులో లోపాలు ఉంటాయని వాటిని అధిగమించడం కోసం ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. లోపాలను ప్రారంభంలోనే గుర్తిస్తే నివారించుకోవచ్చన్నారు. గ్రామంలోని ప్రజలందరూ కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచి రెడ్డిపల్లి సత్యనారాయణ, యాడంగి ఏసు, ముదుండి శ్యాం, శ్రీకృష్ణ ఐ ఇన్స్టిట్యూట్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలి

ప్రజాశక్తి - వీరవాసరం

రజకుల సాంఘిక భద్రత కోసం సామాజిక రక్షణ చట్టం చేయాలని రజక వృత్తిదారుల సంఘం మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం నవుడూరు పద్దాల వెంకమ్మ ఆలయ ప్రాంగణంలో రజకుల మండల కమిటీ విస్తృస్థాయి సమావేశం పాలకోడేటి లక్ష్మణరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రజకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. జిల్లా నాయకులు వర్ధిపర్తి శ్రీనివాసు మాట్లాడుతూ మండలంలోని కొన్ని గ్రామాల్లో రజకులు తమ వృత్తి చేసుకోవడానికి అవసరమైన చెరువులను పూర్తిస్థాయిలో కేటాయించకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రకటించినట్లు యాభై సంవత్సరాలు దాటిన వృత్తిదారులకు పెన్షన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యండమూరి సుబ్బారావు, బైరిపాలెపు మంగరాజు, కొప్పిశెట్టి శ్రీను, మండపాక కొండ, సవ్వదేవి కనకంలు పాల్గొన్నారు.

మోగల్లు మాజీ సర్పంచి పుష్పావతి మృతి

ప్రజాశక్తి - పాలకోడేరు


పుష్పావతి 'ఫైల్‌ఫోటో'

మోగల్లు గ్రామ మాజీ సర్పంచి కెవిఎస్ పుష్పావతి (57) బుధవారం మృతి చెందారు. గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న పుష్పావతి భీమవరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందారు. పుష్పవతి భర్త కెవిఎస్ సూర్యనారాయణ రాజు (బాబు) టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీలో పని చేస్తున్నారు. మండలంతో పాటు మోగల్లు గ్రామ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. అటు టిడిపి అభివృద్ధికి సేవలందిస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ముందుకు సాగుతున్నారు. సూర్యనారాయణ రాజు కూడా గతంలో గ్రామ సర్పంచిగా పనిచేశారు. అయితే భార్య పుష్పావతి ఆకస్మాత్తుగా మృతి చెందడంతో సూర్యనారాయణరాజుకు సతీవియోగం కలిగింది. టిడిపి, బిజెపి, జనసేన, వైసిపి, సిపిఎం ముఖ్య నేతలు, నాయకులు కార్యకర్తలు, గ్రామ పెద్దలు పుష్పవతి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సూర్యనారాయణ రాజు కుటుంబానికి సానుభూతి తెలిపారు.

మానవ విలువల ప్రాధాన్యతను గుర్తించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మానవ విలువల ప్రాధాన్యతను గుర్తించి ఆచరించినాడే మంచి సమాజాన్ని నిర్మించగలమని పలువురు కొనియాడారు. సార్వత్రిక మానవ విలువలు-2 అంశంపై 8 రోజుల పాటు ముఖాముఖి ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమాన్నీ వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో అఖిలభారత సాంకేతిక విద్యా మండలి న్యూఢిల్లీ వారి సహకారంతో బుధవారం ఉదయం ప్రారంభించినట్లు కళాశాల పాలకవర్గ కార్యదర్శి చెలంచర్ల సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిధి చిరాగ్ సచాడే అసిస్టెంట్ ప్రొఫెసర్ శివాజీరావు, ఎస్ జోండ్లే కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ డొంబోవి మహారాష్ట్ర, యశ్వంత్ పాటిల్ ప్రొఫెసర్ అండ్ సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ అసన్ గావ్ మహారాష్ట్ర, ప్రొఫెసర్ రంగనాథ్ అవ్వర్ పుత్తూర్, కె.శేష మహేశ్వరమ్మ ప్రొఫెసర్ జెఎన్‌టియు పులివెందుల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి పాబోలు వెంకటేశ్వరరావు,టెక్నికల్ డైరెక్టర్ చక్కా అప్పారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - మొగల్తూరు

కెపి.పాలెంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సురేష్‌కుమార్ తెలిపారు. కెపి.పాలెం నార్త్, కెపి.పాలెంసౌత్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జిల్లా ఎస్‌పిని కలిసిన ఎంఎల్‌ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జిల్లా ఎస్‌పి అద్నాన్ నయిమ్‌అస్మిని బుధవారం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నియోజకవర్గ శాంతి భద్రతలను వివరిస్తూ, పలు అంశాలపై ఎస్‌పితో చర్చించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా తమ వంతు బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తామని ఎస్‌పి తెలిపారు.

త్వరలో డయాలసిస్ కేంద్రం ప్రారంభం

ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

ఆసుపత్రిలో త్వరలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు తెలిపారు. ఆగస్టు 15లోగా సామాజిక ఆరోగ్య కేంద్రం కోసం నూతనంగా నిర్మించిన భవనాన్ని ప్రారంభించే ప్రయత్నంలో ఉన్నామని తెలిపారు. బుధవారం ఆయన ఆకస్మికంగా సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో సమస్యలపై స్థానికులు, సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయాలసిస్ కేంద్రం ప్రారంభానికి సంబంధించిన కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఆసుపత్రికి వెనక ఉన్న చెత్త డంపింగ్ కేంద్రం, డ్రెయినేజీ, ఇతర మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అందుకు అవసరమైన నిధి కోసం దాతల సహకారాన్ని కోరతామన్నారు. అయితే అక్కడికక్కడే దాతలను కూడా ఆయన ఒప్పించారు. ఆసుపత్రి పరిసరాలను జెసిబితో రేపటి నుంచే శుభ్రం చేయించే కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. ఆసుపత్రి సిబ్బంది కొరత త్వరలోనే తీర్చేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

కూతురుపై తండ్రి దాడి

ప్రజాశక్తి - ఉండి

కుమార్తెపై తండ్రి దాడి చేసిన సంఘటన మండలంలోని యండగండి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. యండగండి గ్రామానికి చెందిన దండే మరియమ్మ 20 సంవత్సరాలు గల్ఫ్‌లో పనిచేసి సంపాదించిన సొమ్మును గ్రామంలోని తన తండ్రి దిడ్ల ముత్యాలుకు పంపింది. ఆ సొమ్ముతో ముత్యాలు తన స్థలంలో ఇంటిని నిర్మించారు. ఆ ఇంటిని కూతురు దండే మరియమ్మకు, కుమారుడు దిడ్ల చిన్న వెంకన్నకు ఇస్తానని తండ్రి చెప్పాడు. అయితే ఇప్పుడు మరియమ్మకు ఇంటిలో వాటా లేదని ఇల్లు చిన్న వెంకన్నకే చెందుతుందని అడ్డం తిరగడంతో గొడవకు దిగిన మరియమ్మపై తండ్రి, తమ్ముడు చిన్న వెంకన్న దాడి చేసి గాయపర్చారు. ఈ మేరకు మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తండ్రి, తమ్ముడిపై ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా..!

ప్రజాశక్తి - కాళ్ల


అధ్వానంగా ఉన్న కలవపూడి - మోడీ రోడ్డు

కొద్దిపాటి వర్షం పడితే చాలు రోడ్డంతా బురదమయమవుతోంది. కలవపూడి ఆర్అండ్‌బి రోడ్డుపై ప్రయాణం సాగించాలంటే మత్స్యకార గ్రామాల ప్రజలు నానావస్థలు పడుతున్నారు. కలవపూడి గ్రామ పంచాయతీ మోడీ గ్రామానికి వెళ్లే బిటి రహదారి అధ్వానంగా తయారైంది. పూర్తిగా గుంతలు, రాళ్లు తేలడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కలవపూడి పంచాయతీ నుండి వావిలాలపాడు మూడు కిలోమీటర్లు, మోడీ గ్రామానికి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం. ఈ రహదారి పొడవునా గుంతలు ఏర్పడి, రాళ్లు తేలాయి. తారురోడ్డు గ్రావెల్ రోడ్డుగా మారింది. కలవపూడి పంచాయతీకి శివారున మోడీ, వావిలాలపాడు గ్రామాలు ఉన్నాయి. ఏ అవసరమైనా, నిత్యావసర సరుకులు కొనుక్కోవాలన్నా కలవపూడి గ్రామానికి వారంతా వెళ్లాలి. రహదారి బాగున్నప్పుడు ఆటోలు తిరిగేవి. రహదారి పాడైపోవడంతో వాహనాలు తిప్పడం లేదు. ద్విచక్ర వాహనం కూడా చాలా కష్టంగా వెళ్తుందని మత్స్యకారులు చెబుతున్నారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే 20 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని గతంలో చాలా సార్లు ఆయా గ్రామాలు ప్రజలు వేడుకున్న అధికారులు అవేవీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు బురదగా ఉండటంతో రాత్రి సమయాల్లో గుంతలు కనిపించక వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు పట్టించుకుని ఈ రోడ్డు మరమ్మతులు చేయాలని అధికారులకు ఆదేశించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వానికి ప్రజలకు వారధి మీడియా

ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన ఎంఎల్ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు


ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ రాధాకృష్ణ

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా మీడియా ఉండాలని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. ప్రజాశక్తి ముద్రించిన విజయోత్సవ ప్రత్యేక సంచికను బుధవారం స్థానిక కార్యాలయం వద్ద ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నిజాలు రాయడమే నిజమైన జర్నలిజం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తామరాపు సత్యనారాయణ, కౌరు వెంకటేశ్వర్లు, నాగరాజు, ప్రజాశక్తి నరసాపురం డివిజన్ ఇన్‌ఛార్జి కటకంశెట్టి బాలాజీనాయుడు, తణుకు విలేకరి సిహెచ్‌డి. రాజశేఖర్ పాల్గొన్నారు.

మొగల్తూరులో ప్రదర్శన

ప్రజాశక్తి - మొగల్తూరు

ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ప్రదర్శన నిర్వహించారు. కారంచేడు మారణ హోమంలో మృతి చెందిన దళితుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ బుధవారం రాత్రి మొగల్తూరు, పేరుపాలెం తదితర గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో ప్రదర్శన నిర్వహించి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర నాయకులు గరికపూడి జేమ్స్ రాజుమాదిగ, జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ రత్నరాజు మాదిగ, జిల్లా మహిళా అధ్యక్షులు సెట్టెం ఝాన్సీ లక్ష్మిమాదిగ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


నినాదాలు చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా నాయకురాలు మదీనా బేబీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా ఏళ్ల తరబడి పిల్లలకు సేవలందిస్తున్నా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. వారికిచ్చే రూ.3,000 జీతం ఏమాత్రమూ సరిపోవడం లేదన్నారు. ధరలు పెరుగుదల అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని, కార్మికులుగా గుర్తించాలని, మెనూఛార్జీ పెంచాలని గ్యాస్ బండలు ప్రభుత్వం సరఫరా చేయాలని ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, యూనిఫారం ఇవ్వాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాంభాని దుర్గ, పాండ్రంగి రాము, పోలాకి రామలక్ష్మి, కింబూరి చిన్నమ్మలు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో అభివృద్ధి

ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు


శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ రాధాకృష్ణ

తణుకు నియోజకవర్గంలో అన్ని గ్రామాలనూ అభివృద్ధి చేసుకునే విధంగా, రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం వేల్పూరు గ్రామంలో విష్ణుప్రియ నగర్‌లో సీసీ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వేల్పూరులో 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి రూ.60 లక్షలు సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. వేల్పూరులో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులను మాజీ మంత్రి కారుమూరి దుర్మార్గంగా వ్యవహరించి నిలిపివేశారన్నారు. పంచాయతీ నిధులు మళ్లించి పూర్తిగా నిర్వీర్యం చేసిన ఘనత వైసిపికి దక్కుతుందన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో దాదాపు రూ.200 కోట్లు విడుదల చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి విశ్వనాధం కృష్ణవేణి, వైస్ ప్రెసిడెంట్ గుణ్ణం రాజారావు, మాజీ ఎఎంసి చైర్మన్ చిట్టూరి సునంద, మాజీ వైస్ ప్రెసిడెంట్ రెడ్డి నరేంద్రప్రసాద్, బిజెపి తణుకు కన్వీనర్ అయినంపూడి శ్రీదేవి పాల్గొన్నారు.

హాస్టళ్లలో ఎంఎల్‌ఎ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం


విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎంఎల్‌ఎ నాయకర్

పట్టణంలోని 21వ వార్డు ఎన్‌టిఆర్ కాలనీలోని ఎస్‌సి, బిసి బాలికల హాస్టళ్లను ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. హాస్టళ్లలో వసతి, భోజనాలు, మౌలిక సదుపాయాల గురించి విద్యార్థినులను నాయకర్ అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు భోజనాలు వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. హాస్టల్స్‌లో అవసరమైన మరమ్మతు పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో జక్కం బాబ్జి, వలవల నాని, నిప్పులేటి తారక రామారావు, భారతి సురేష్, పోలిశెట్టి సాంబ పాల్గొన్నారు.

రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి కృషి

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

ప్రజాశక్తి - ఆకివీడు

రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి మోడీ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని కేంద్ర పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. బుధవారం మండలంలోని కుప్పనపూడి గ్రామంలో ఆప్కాబ్ మాజీ ఉపాధ్యక్షులు, జనసేన నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు (రత్నం) పుట్టినరోజు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం బిజెపి మండల అధ్యక్షులు కట్రెడ్డి ఏడుకొండలు నివాసంలో ఆయన పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్రంలో ఎవరైనా ముందుకు రావాలన్నారు. అలా వచ్చిన వారికి పూర్తి ప్రోత్సాహం, సహకారం ఉంటుందని తెలిపారు. త్వరలోనే పరిశ్రమల విషయంలో రాష్ట్రానికి మంచి సమాచారం ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు పాకా సత్యనారాయణ జిల్లా అధ్యక్షులు నార్ల తాతాజీ, కార్యకర్తలు అభిమానులు నాయకులు పాల్గొన్నారు. ఆయనకు కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ, ఎంఎల్‌ఎలు కనుమూరి రఘురామకృష్ణంరాజు, బొలిశెట్టి శ్రీనివాస్, ఎంఎల్‌సి వెంకటరమణ శుభాకాంక్షలు తెలిపారు.


మాట్లాడుతున్న ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి నరసింహమూర్తి

ఎరుకల హక్కుల సాధనకు కృషి

కాళ్ల: ఎరుకల కులస్తుల హక్కుల సాధనకు కషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎపి ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర కమిటీ కార్యదర్శి కుతాడి నరసింహమూర్తి అన్నారు. కాళ్లలో ఎరుకుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతిని బుధవారం నిర్వహించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి కుతాడి నరసింహమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర నాయకులు పాలపర్తి శ్రీనివాసరావు, పివి గాయత్రి, పాలపర్తి శ్రీనివాస చక్రవర్తి పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏకలవ్య జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ ఎరుకల కులస్తులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంఘాల సమైక్య వ్యవస్థాపకులు సోడదాసి గంగయ్య మాట్లాడుతూ ఐక్యంగా హక్కుల కోసం పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర మహిళా కమిటీ జాయింట్ కార్యదర్శి కుతాడి లావణ్య, జిల్లా జాయింట్ సెక్రటరీ సాలా శీను బాబు, మండల అధ్యక్షులు నలబ శ్రీను, మండల కార్యదర్శి కుతాడి సత్యనారాయణ, మండల జాయింట్ సెక్రటరీ బండి వెంకటేశ్వర్లు, నాయకులు కుతాడిరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి జనసేన సభ్యత్వ నమోదు

గణపవరం: మండలంలో ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకూ గ్రామాల్లో జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షులు తోట శ్రీను బుధవారం చెప్పారు. సభ్యత్వ నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరూ రూ.500 చెల్లించి నమోదు చేసుకోవాలని చెప్పారు. సభ్యత్వ నమోదు చేసుకున్న వారికి ఏదైనా ప్రమాదం జరిగి మరణిస్తే రూ.5 లక్షల ప్రమాద బీమా పార్టీ తరపున ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వారి కుటుంబానికి అందజేస్తారని చెప్పారు, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని జనసేనలో చేరాలని కోరారు.

మురళీకృష్ణంరాజుకు సత్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్


మురళీకృష్ణంరాజు దంపతులను సత్కరిస్తున్న సభ్యులు

ఎపి ఎన్‌జిఒస్ అసోసియేషన్ పాలకొల్లు అధ్యక్షులు గుడాల హరిబాబు అధ్యక్షతన అసోసియేషన్ కార్యదర్శి, సిటిఒ వేగేశ్న మురళీకృష్ణంరాజు ఉద్యోగ విరమణ కార్యక్రమం పాలకొల్లు ఎంపిడిఒ కార్యాలయం వద్ద బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్‌జిఒస్ జిల్లా అధ్యక్షులు, జెఎసి ఛైర్మన్ చోడగిరి శ్రీనివాసరావు విచ్చేసి మాట్లాడారు. మురళీకృష్ణంరాజు విధి నిర్వహణలో తన కేడర్‌కే వన్నెతెచ్చే విధంగా విధులు నిర్వర్తించారని తెలిపారు. ఈ అసోసియేషన్‌లో అనేక పదవులు చేపట్టి అనేక ఉద్యమాల్లో పాల్గొని అందరి మన్ననలూ పొందారని తెలిపారు. ముందుగా ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. వివిధ ఉద్యోగ సంఘాల నేతలు సమస్యలను తెలిపారు. సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తానని శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. జిల్లా కార్యదర్శి ఎన్‌వి.రామారావు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వ చీఫ్ సెక్రటరీని కలిసి వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న సమస్యలను చర్చించామని, వాటిని త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సచివాలయంలో పనిచేస్తున్న ఎఎన్ఎంలకు యాప్‌ల భారాన్ని తగ్గించాలని, ఫీల్డ్ సిబ్బందికి బయోమెట్రిక్ తొలగించాలని, అలాగే గ్రేడ్ వన్‌గా ప్రమోషన్లు ఇప్పించాలని ఎఎన్ఎంలు కోరారు. ఫీల్డ్ సూపర్‌వైజర్ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఉండాలనే నిబంధనలను తొలగించాలని కోరారు. కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు కొంతమందిని రెగ్యులర్ చేయడం జరిగిందని, మిగిలిన వారిని కూడా త్వరలో రెగ్యులర్ చేసేందుకు పైఅధికారులకు తమ తరపున రిప్రజెంటేషన్ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర జెఎసి సెక్రటరీ జనరల్ ఆర్ఎస్ హరినాథ్ మాట్లాడారు. అనంతరం మురళీకష్ణరాజు దంపతులను ఘనంగా సత్కరించారు. మురళీకష్ణ రాజు మాట్లాడుతూ తాను విధి నిర్వహణలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొని సంఘం ద్వారా కార్యక్రమాలు చేశానని తెలిపారు. ఖాళీ సమయంలో తన తండ్రి ఆశయాల మేరకు సమాజ సేవ చేసేందుకు ముందు ఉంటానని, అలాగే ఉద్యోగులకు సహకారిగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసరావు, సిటిఒ వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ ఎం.అనుపమ, ఇఒపిఆర్‌డి వైభవతి, యుటిఎఫ్ నాయకులు ఎకెవి.రామభద్రం, క్రాంతి కుమార్, ఎన్‌జిఒ నాయకులు నరసరాజు సత్యనారాయణ పాల్గొన్నారు.

మంత్రి నిమ్మలకు సత్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గ ప్రజలందరూ నా కుటుంబంగా భావించి రాత్రింబవళ్లు సేవకునిగా పనిచేస్తున్నందు వల్లే ప్రజల ప్రేమానురాగాలు పొందగలిగానని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆయన ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధికంగా 69.30 శాతం ఓట్లతో విజయం సాధించి రెండో స్థానంలో నిలిచినందుకు బుధవారం పాలకొల్లులో ఎన్‌డిఎ నాయకులు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మంత్రి రామానాయుడును మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, నాయకులు జివి, పెచ్చెట్టి బాబు, ఉన్నమట్ల కబర్థి, మహమ్మద్ జానీ, కడలి గోపి, పీతల శ్రీనివాస్, పొట్నూరి శ్రీనివాస్, దీప్తి అప్పారావు పూలమాల వేసి సత్కరించారు.

వల్లూరులో ఏకలవ్య జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఆచంట

ఏకలవ్యుడు మహాభారతంలో తన గురుభక్తిని చాటుకుని గొప్ప ఔన్నత్యం కలిగిన పాత్ర పోషించారని జడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు అన్నారు. వల్లూరులో బుధవారం ఏకలవ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. అనంతరం సురేష్ బాబు మాట్లాడుతూ ఏకలవ్యుడు తన బ్రొటనవేలును ద్రోణాచార్యుడికి గురుదక్షిణగా ఇచ్చి అందరి మన్నలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి కమిటీ అధ్యక్షులు దేవల రమేష్, వైస్ ఎంపిపి తాళం శ్రీనివాసరావు, ఎంపిటిసి ఆరుమిల్లి సుబ్బారావు, నాయకులు నేలపూడి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

23 నుంచి ఆధార్ క్యాంపుల నిర్వహణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకూ ఆధార్ క్యాంపుల నిర్వహణకు సంబంధించి సర్క్యూలర్‌ను బుధవారం అధికారులు విడుదల చేశారు. మొత్తం ఐదు రోజులు క్యాంపు ఉంటుందని తెలిపారు. ఈ క్యాంపులు సచివాలయ పరిధిలో, పాఠశాలలు, కాలేజీలు, అంగన్వాడీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఆధార్ సర్వీస్ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కొత్త ఆధార్ ఎన్రోల్మెంట్, ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్ చేస్తారని తెలిపారు. క్యాంపు సమయంలో PS Gr-VI (DA) / WEDPS వారి స్థానంలో ఇతర సచివాలయ సిబ్బందిని ఇన్‌ఛార్జిగా వేస్తారని పేర్కొన్నారు.

కుష్టు వ్యాధిపై ఇంటింటా సర్వే

ప్రజాశక్తి - గణపవరం

పిప్పర పిహెచ్‌సి పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 18 నుంచి ఆగస్టు రెండో తేదీ వరకూ కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ పారా మెడికల్ అధికారి ఎంపి.రమేష్ తెలిపారు. బుధవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో సర్వే కార్యక్రమంపై వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధిపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. శరీరంపై రాగి రంగు మచ్చలు, బొడుపులు, స్పర్శ లేని మచ్చలు ఉంటే స్థానిక వైద్య సిబ్బందికి తెలపాలన్నారు. ఆగస్టు రెండో తేదీ వరకూ ఆస్పత్రి పరిధిలోని గ్రామాలన్నింటిలో వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వ్యాధిపై సర్వే నిర్వహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ వెంకటేశ్వర్లు, ఆరోగ్య సహాయకులు నామాల రాజు, నాగమణి, జోన్స్ పాల్గొన్నారు.

'మంత్రి నిమ్మల వల్లే రైతులకు మేలు'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రాష్ట్రంలో రైతులకు మేలు జరిగేది రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు వల్లేనని, ఆయన సమర్థతను గుర్తించే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ శాఖను కట్టబెట్టారని రైతు నాయకులు తెలిపారు. వరిధనం గ్రామంలో బుధవారం చీమలకోడు పంట కాలువలో గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు మొదలయ్యాయి. మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలతో ఇరిగేషన్ శాఖ పర్యవేక్షణలో పనులను నాయకులు ప్రారంభించారు. సుమారు రూ.6.60 లక్షలతో జరిగే ఈ పనుల వల్ల కాలువ శివారు వరకూ నీటిపారుదల జరిగి సాగునీటి సమస్య ఎదురుకాదని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో రైతుల సంక్షేమం పట్టించుకోకపోగా వ్యవసాయం చేయలేని పరిస్థితుల్లోకి నెట్టేశారని విమర్శించారు. కనీసం పంట కాలువలు, మురుగు డ్రెయిన్లను పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతుల సూరిబాబు, పెచ్చెట్టి నాగరాజు, ద్రాక్షారపు జ్యోతి, బొక్క సూరిబాబు, మామిడి శెట్టు ఏసుబాబు, వర్ధనపు కాంతారావు పాల్గొన్నారు.